
నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 21 జూన్ 2024 | NIZAMABAD



## కేసీఆర్‌ను కలిసిన తెలంగాణ ఉద్యమకారులు

బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను రెంజల్, ఎడపల్లి మండలాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు, నాయకులు గురువారం కలిశారు. ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జాన్కంపేట లక్ష్మీనృసింహస్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమకాలం నాటి విషయాలపై కేసీఆర్‌తో ముచ్చటించారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో డాక్టర్ తెలంగాణ శంకర్, కాశం సాయిలు, తిరుపతి రాము, పాశం భాస్కర్, శేఖర్‌రాజు ఉన్నారు.

–రెంజల్/ఎడపల్లి, జూన్ 20





వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం కోటగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

# వేతన.. వేదన

- మూడు నెలలుగా అందని జీతాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో జీపీ కార్మికులు
- నిజామాబాద్ జిల్లాలో 2873 మంది కార్మికులు
- రూ.7.80కోట్ల బకాయిలు
- నిధులు విడుదల చేయాలని వేడుకోలు





కోటగిరి, జూన్ 20: ఉదయం లేచింది మొదలుకొని రాత్రి పడుకునే వరకు పనిచేస్తూ గ్రామాలను అద్దంలా ఉంచడంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న కృషి వెలకట్టలేనిది. ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా నిత్యం పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. గ్రామాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచే పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు లేక ఇక్కట్లకు గురవుతున్నారు. అసలే చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న పంచాయతీ కార్మికులు మూడు నెలలుగా మరిన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**2873 మంది కార్మికులు..**

నిజామాబాద్ జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆయా జీపీల పరిధిలో మల్టీపర్పస్ వర్కర్ల పేరుతో 2873 మందిని నియమించింది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో విశేష కృషి చేస్తున్నారు. అసలే వానకాలం..వ్యాధులు ప్రబలే సమయంలో ప్రజలు ఆరోగ్యకరంగా ఉండాలంటే పల్లెలు శుభ్రంగా ఉండాలి. ఇందులో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం. కానీ జిల్లాలో పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు కొన్నిచోట్ల ఆరు నెలలు,మరికొన్ని చోట్ల మూడు నెలల నుంచి వేతనాలు అందడం లేదు. దీంతో త్వరలో కార్మికులు నోటీసు ఇచ్చి సమ్మెలోకి వెళ్తే పల్లెలు మురికి కూపాలుగా మారే ప్రమాదం ఉన్నదని స్థానికులు అంటున్నారు. కార్మికుల వేతనాలు సకాలంలో విడుదల చేస్తే పల్లెలు పరిశుభ్రంగా ఉంటాయని, దీంతో ప్రజలు సైతం ఆరోగ్యంగా ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు.

**జిల్లాలో రూ.7.80కోట్ల బకాయిలు..**

జిల్లా వ్యాప్తంగా ఉన్న 2873 మంది పంచాయతీ కార్మికులుండగా.. వీరిలో ఒక్కొక్కరికి నెలకు రూ. 9500లు వేతనం చెల్లించాల్సి ఉంది. కొన్ని పంచాయతీల్లో నాలుగు, ఐదు నెలలు, మరికొన్ని పంచాయతీల్లో ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో జిల్లాలో రూ.7.80 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. జిల్లా అధికారులకు, మండల అధికారులు ఎంపీడీవో, ఎంపీవోలకు వినతిపత్రం అందజేసినా ప్రయోజనం లేకుండా పోయిందని పంచాయతీ కార్మికులు వాపోతున్నారు.

### పస్తులు ఉండాల్సి వస్తున్నది..



సకాలంలో వేతనాలు అందకపోవడంతో మా కుటుంబాలు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొన్నది. మండల, జిల్లాస్థాయి అధికారులకు అనేకసార్లు వినతిపత్రం అందజేశాం. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికులకు వేతనాలు అందేలా చూడాలి.

- రాజేశ్వరి, ఉమ్మడి కోటగిరి మండలాల జీపీ కార్మికుల సంఘం అధ్యక్షురాలు

### బాకీ చేసి ఇల్లు గడుపుతున్నా...



గ్రామ పంచాయతీ నుంచి మూడు నెలల నుంచి జీతాలు రాలేదు.. సార్లకు ఎప్పుడు అడిగినా పైసలు లేవు అంటున్నారు. నెలనెలా జీతాలు ఇవ్వకుంటే ఎట్ల బతకాలె? ఇల్లు ఎట్ల గడవాలె? తెలిసిన వాళ్ల దగ్గర అప్పులు చేసి ఇల్లు గడుపుతున్నాం. ఇట్ల ఎన్ని రోజులు గడపాలా.? గవర్నమెంట్‌కు తెల్వ దా? నెలనెలా జీతాలు ఇవ్వాలని. జీతాలు రాక చానా కష్టమవుతున్నది.

- సాయవ్వ, పంచాయతీ కార్మికురాలు,ఎత్తొండ

### నిధులు విడుదల కాగానే జమచేస్తాం..

మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులకు మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన వేతనాలు ఇప్పటి వరకు రాలేదు. కార్మికులకు రోజూ ఏదో ఒకటి నచ్చజెప్పి పనులు చేయిస్తున్నాం. వాళ్లకు జీతాలు రాక చాలా ఇబ్బందిగా ఉన్న మాట వాస్తవం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే వెంటనే వారి ఖాతాల్లో జమ అవుతాయి.

- మారుతి, ఎంపీవో, కోటగిరి

# సారుతోనే.. పవర్‌ఫుల్

## నిరంతర కరెంటుకు కేరాఫ్ కేసీఆర్

- కోతల్లేని విద్యుత్ సరఫరా.. కుటీర పరిశ్రమలకు భరోసా
- కరెంటు కష్టాలు తీర్చిన ఘనత గులాబీ బాస్‌దే..
- 24గంటల కరెంటుతో రంది లేకుండా జీవనోపాధి

సమైక్య రాష్ట్రంలో కరెంటు గోసలు పడ్డాం.. రోజంతా నాలుగు గంటల కరెంటు ఉంటే అదృష్టంగా భావించేవాళ్లం.. కరెంటు ఉంటేనే చేసే పనులు లేక ఇంట్లో అందరం పస్తులుండాల్సిన పరిస్థితి ఉండె. అట్లాంటి గడ్డుకాలాన్ని మరిపించేలా తయారుజేసిండు కేసీఆర్ సారు. తెలంగాణ అచ్చినంక సీఎం అయిన కేసీఆర్.. ఫస్టు కరెంటును మంచిగ జేసిండు. 24గంటలు కరెంటు కోతలు లేకుండా చూసిండు. మా జీవితాల్లో వెలుగులు నింపిండు. విద్యుత్తు వ్యవస్థను సమూలంగా మార్పులు చేసి పవర్‌ఫుల్ తెలంగాణగా తీర్చిదిద్దిండు. అలాంటి కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూడడం సబబు కాదు. చేతనైతే అంతకన్నా మెరుగ్గా కరెంటు సరఫరా చేయాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### కేసీఆర్ టైంలనే కరెంటు బాగున్నది..



శక్కర్‌నగర్, జూన్ 20: ఆంధ్రోళ్ల పాలనలో ఉన్నప్పుడు కరెంటు సక్కగ ఉండకపోతుండె. ఇష్టమొచ్చినప్పుడు వస్తుండె. పని చేసుకుందామంటే కుదరకపోతుండె. తెలంగాణ అచ్చినంక కేసీఆర్ ఎట్ల జేసిండో.. ఏం జేసిండో కానీ కరెంటు అయితే మస్తుగా వస్తుండె. కరెంటు కటకట లేకుంటా ఉండేది. దీంతో మా పిండి గిర్నీ మంచిగ నడిచింది. ప్రజలు ఎప్పుడు వచ్చినా వెంటనే మర ఆడించి ఇచ్చేటోళ్లం. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కరెంటు సరఫరా సక్రమంగా అందడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిల్‌ను కొనసాగించాం.

- సయ్యద్ అక్బర్ అలీ, ఫ్లోర్ మిల్ యజమాని, ఎడపల్లి

### చేతినిండా పనిఉండేది..



పదేండ్లకు ముందు రోజుకు నాలుగు గంటలు మాత్రమే కరెంటు ఉండేది. అది కూడా రెండుసార్లు వచ్చేది. మిగిలిన టైంల ఖాళీగా కూసునేటోళ్లం. కేసీఆర్ సారు సీఎం అయిన తర్వాత కరెంటు పోతదనే ఆలోచన లేకుండా తయారుజేసిండు. సారు సీఎంగా ఉన్నన్ని రోజులు నేను చేస్తున్న కార్ డెంటింగ్, పెయింటింగ్ పనులు చురుగ్గా సాగాయి. రోజూ చేతినిండా పనిఉండేది. కరెంటు మంచిగ వచ్చేటట్లు చేసిన కేసీఆర్ సారుపై నిందలేయడం మంచిది కాదు.

- షేక్ అయూబ్, కార్ డెంటింగ్, పెయింటర్, బోధన్.

### పదేండ్ల కిందటి రోజులొచ్చినయ్..



కరెంటు ఎప్పుడుపడితే అప్పుడు పోతున్నది. తెలంగాణ రాక ముందు ఎట్ల ఉండెనో ఇప్పుడు కూడా అదే లెక్క తయారైంది. రాష్ట్రం వచ్చిన తర్వాత కేసీఆర్ కరెంటును బాగుజేసిండు. కరెంటు పోతదనే ముచ్చట లేకుండా జేసిండు. నేను బైక్‌లు రిపేర్ చేయడానికి కరెంటు కచ్చితంగా కావాలె. పదేండ్లల్ల దినమంతా కరెంటు ఉండుట్ల పనులు ఆగకపోతుండె. ఒక్కటే రోజు రెండు బైక్‌ల ఇంజిన్లు రిపేర్ చేసేవాడిని. మాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కేసీఆర్ కరెంటు ఇచ్చిండు.

- షేక్ ఇమ్రాన్, బైక్ మెకానిక్, బోధన్

# బయట సూపర్ లోపల బేకార్

**మేడిపండు చందంగా హోటళ్లు**

- కుళ్లిన మాంసం, రసాయనాల వాడకం
- ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వైనం
- ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో తేటతెల్లం
- పేరుమోసిన హోటళ్లలోనూ అనైతిక దందా
- కఠిన చర్యలు తీసుకోవడంలో తీవ్ర నిర్లిప్తత



నిజామాబాద్, జూన్ 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి): మేడిపండు చూడు మేలిమై నుండు... పొట్ట విప్పి చూడు పురుగులుండు... అన్నట్లుగా మారింది హోటళ్లు, రెస్టారెంట్ల తీరు. కొత్త, పాతవి అనే తేడా లేకుండా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కుళ్లిన మాంసాన్ని, ప్రాణాంతక రసాయనాలు, చెడిపోయిన పదార్థాలను వినియోగిస్తున్నారు. వాటికే రంగులు అద్ది ఆహార ప్రియులకు వడ్డించి భారీగా దండుకుంటున్నారు. ఆకలితో వచ్చే వారి ప్రాణాలు తీస్తూ అనైతిక వ్యాపారం చేస్తూ హోటళ్ల నిర్వాహకులు చేయరాని నేరాలకు పాల్పడుతున్నారు. పదిరోజుల్లో నిజామాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు రెండు ప్రధానమైన హోటళ్లపై దాడులు నిర్వహించారు. రెండింట్లోనూ కుళ్లిన చికెన్, మటన్ మాంసపు ముద్దలు, చెడిపోయిన ఆహార పదార్థాలను గుర్తించారు. వంటల్లో వాడేందుకు వీలు లేని రసాయనాలను సైతం వినియోగిస్తుండడం తనిఖీల్లో బయటపడింది.

**ప్రాణాలతో చెలగాటం...**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పేరుమోసిన రెస్టారెంట్‌లో పది రోజుల క్రితం ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహిస్తే విస్తూ గొల్పే వాస్తవాలు బయటపడ్డాయి. పశువులు, కుక్కలు కూడా తినడానికి వీల్లేని ఆహారాన్ని ఫ్రిజ్‌లలో దాచి పెట్టారు. సముద్ర చేపలు, రొయ్యలతోపాటు చికెన్, మటన్, కుళ్లిన గుడ్లను సైతం ఫ్రిజ్జుల్లో ఉంచడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులే అవాక్కయ్యారు. బల్క్ ఆర్డర్లు, గ్రూపులుగా వచ్చే ఆహార ప్రియులకు ఈ చెడిపోయిన మాంసాన్ని కలిపేసి డీప్ ఫ్రై రూపంలో వడ్డిస్తున్నట్లుగా సదరు రెస్టారెంట్ నిర్వాహకులు చెప్పినట్లు తెలిసింది. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో కొత్తగా వెలిసిన రెస్టారెంట్లలోనూ ఇదే రకమైన తంతు ఉన్నట్లుగా పలువురు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానిప్పటికీ తనిఖీలు చేయలేదు. వినాయక్‌నగర్‌లో తాజాగా చేసిన దాడుల్లో ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఘోరమైన దుస్థితి బయటపడింది. ఇక్కడ కూడా విషపూరిత రసాయనాలు, కుళ్లిన మాంసం ముక్కలు లభించాయి. మందు ప్రియులకు వీటిని మత్తులో ఉన్నప్పుడు స్టఫ్ కింద వడ్డిస్తున్నట్లుగా అధికారుల విచారణలో వెల్లడైంది.



ఎంఎస్‌ఆర్ బార్‌లోని ఫ్రిజ్‌లో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను చూపిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

**నిరంతర తనిఖీలు ఏవి?**

ఫుడ్ సేఫ్టీ అధికారుల తీరు కూడా పలు అనుమానాలకు తావిస్తున్నది. నిరంతర తనిఖీలు చేపట్టి ఉంటే ఇలాంటి దుస్థితి ఉండేది కాదు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో హైదరాబాద్‌లో మొదలు పెట్టిన తనిఖీలు జిల్లాస్థాయికి పాకడంతో అక్రమార్కుల బండారం బట్టబయలైంది. బాధ్యతను మరిచి మామూళ్ల మత్తుకు అలవాటు పడడంతోనే తినుబండారాల దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ బృందాలు కాలు పెట్టడం లేదన్న అపవాదు ప్రజల్లో ఉన్నది. అకస్మాత్తుగా ఫుడ్ సేఫ్టీ బృందాలు వారి బాధ్యతను నిర్వర్తిస్తుండడంతో ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### బార్ అండ్ రెస్టారెంట్‌పై అధికారుల దాడులు

వినాయక్‌నగర్, జూన్ 20: నగరంలోని పాంగ్రా పరిధిలో ఉన్న ఎమ్ఎస్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌పై గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. రెస్టారెంట్‌లోని ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన చికెన్, చికెన్ లెగ్ పీసులు, టేస్టింగ్ సాల్ట్, కలర్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫంగస్ వచ్చిన ఆహార పదార్థాలను చెత్తబుట్టలో పారేశారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి తారాసింగ్ నాయక్ మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించామన్నారు. నాణ్యతలేని, పాడైన ఆహార పదార్థాలు నిల్వ ఉంచడంపై రెస్టారెంట్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామన్నారు. మరోసారి పునరావృతమైతే రెస్టారెంట్‌ను సీజ్‌చేస్తామని హెచ్చరించారు.

## బోధన్ డివిజన్‌కు మళ్లీ సబ్ కలెక్టర్ హోదా

- ఆర్మూర్, బాన్సువాడ డివిజన్‌లకు కూడా..
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

బోధన్, జూన్ 20: అనేక దశాబ్దాలపాటు బోధన్ రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్ పేరిట రెవెన్యూ డివిజన్ అధికారిగా విధులు నిర్వహించేవారు. కొన్నేండ్లుగా రెవెన్యూ డివిజన్ అధికారులుగా నాన్ ఐఏఎస్ అధికారులు ఉంటున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలోని 15 రెవెన్యూ డివిజన్ల పాలనాధికారులుగా ఐఏఎస్ అధికారులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా రెవెన్యూ డివిజన్ కార్యాలయాలకు సబ్ కలెక్టర్ హోదాను కల్పించింది. ఈ మేరకు ఈ నెల 13న జీవోను విడుదల చేసింది. దీంతో బోధన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి మళ్లీ సబ్ కలెక్టర్ హోదా వచ్చినట్లయ్యింది. గతంలో ఇక్కడ మొదటి అపాయింట్‌మెంట్‌లో సబ్ కలెక్టర్‌గా పనిచేసిన సోమేశ్ కుమార్ అనేక ఏండ్లపాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన విషయం తెలిసిందే.. దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో ఆయనతోపాటు ప్రాణాలు కోల్పోయిన సుబ్రహ్మణ్యం కూడా ఇక్కడే సబ్‌కలెక్టర్‌గా పనిచేశారు. ఇదిలా ఉండగా బోధన్‌తోపాటు కొత్త రెవెన్యూ డివిజన్లు ఆర్మూర్, బాన్సువాడలకు కూడా సబ్ కలెక్టర్ హోదా ఇచ్చారు. ప్రస్తుతానికి ఆర్డీవోలే ఆయా డివిజన్ పాలనాధికారులుగా ఉన్నప్పటికీ ముమ్ముందు ఐఏఎస్ అధికారులను నియమించే అవకాశం ఉన్నది.

## రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

**ఏరియా దవాఖానలో మాజీ స్పీకర్ పోచారం ఆకస్మిక తనిఖీ**

బాన్సువాడ టౌన్, జూన్ 20: దవాఖానకు వచ్చే రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు తగిన సదుపాయాలు కల్పించాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడలోని మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే, బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించారు. రోగులు, విద్యార్థులతో పాటు ముచ్చటించిన ఆయన అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఇప్పుడున్న ఏరియా దవాఖాన పాత భవనాన్ని కూల్చేసి రూ.37 కోట్లతో నూతన భవన నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో తాత్కాలికంగా ఉర్దూ కళాశాలలో వైద్యమందిస్తున్నామని చెప్పారు. కాస్త ఇబ్బందిగా ఉన్నా సాధ్యమైనంత వరకు రోగులకు మంచి వైద్య సదుపాయాలు కల్పించాలని సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్‌కు సూచించారు. అదనపు తరగతి గదుల నిర్మాణంతో విద్యార్థుల సంఖ్య పదింతలు పెరిగినా ఇబ్బందులు ఉండవన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మధ్యాహ్న భోజనం వండుతున్న క్రమంలో పోచారం గంటె తిప్పారు. నర్సింగ్ కాలేజీలో సమస్యలు పరిష్కరించాలని నర్సింగ్ విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సరిపడా బోధన సిబ్బంది లేరని, సిలబస్ పూర్తి చేయడానికి ఇబ్బందిగా ఉందని ప్రిన్సిపాల్ భూలక్ష్మి చెప్పగా, అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని పోచారం హామీ ఇచ్చారు.




బాన్సువాడలోని మాతాశిశు దవాఖానలో నర్సింగ్ విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న మాజీ స్పీకర్ పోచారం